క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు తోటమూల విద్యార్థి ప్రాజెక్టు

పెడన: రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు తోటమూల భట్టు మోహనరావు, హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పృథ్వీ శివనాగ చంద్ర వంశీ తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికైందని ఎంఈఓ మెటల్దారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్లో బూజు, దుమ్ము, ధూళి దులుపుకునే పరికరాన్ని అతి తక్కువ ఖర్చుతో విద్యార్థి ప్రాజెక్టును తయారుచేశారని వివరించారు. 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో జరిగే ఈ ఎంపిక ప్రక్రియ జాబితా గురువారం విడుదలైందన్నారు. గైడ్ టీచర్ ఎల్. ఇందిరా, పెడన మండల సైన్స్ కోఆర్డినేటర్ ఎంసీహెచ్‌వీఎల్ కృపావర్ధన్, విద్యార్థి వంశీకి పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్‌బీకే భవన నిర్మాణ పనులు ప్రారంభం

రావివారిపాలెం(మోపిదేవి): మోపిదేవి గ్రామ సచివాలయం–2 లో రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య సబ్ సెంటర్ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి మాట్లాడుతూ ఆర్‌బీకే భవనాన్ని రూ. 42 లక్షలు, హెల్త్ సెంటర్ భవనాన్ని రూ. 27 లక్షలతో నిర్మిస్తున్నారని చెప్పారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందరసింగ్, నందిగం అభిషేకరావు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

కోడూరు: సాలెంపాలెం, బడేవారిపాలెం జెడ్పీ పాఠశాలలను జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ గురువారం పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న శిక్షణను అడిగి తెలుసుకున్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు శ్రమించాలని సూచించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు, హెచ్‌ఎంలు, విద్యాకోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

పెడన: ప్రకృతి సేద్యంలో విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని, నవ ధాన్యాలు పంట పొలాల్లో వేయడం ద్వారా నేల సారవంతం అవుతుందని నందమూరు సర్పంచ్ పరసా నరసింహారావు అన్నారు. గురువారం నందమూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రకృతి సేద్యంలో నవధాన్యాల పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మచిలీపట్నం డివిజన్ యాంకర్ స్వామిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం రజనీ మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా పంట దిగుబడులు నాణ్యమైనవిగా ఉంటాయన్నారు. విత్తన శుద్ధి సమయంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. డ్వాక్రా మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు, ఫ్యాన్లు బహూకరణ

బంటుమిల్లి: నాగన్నచెరువు పంచాయతీ శివారు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ నడా ఉయ్యమ్మ కుటుంబ సభ్యులు 15 కుర్చీలు, రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉయ్యమ్మ, ఆమె కుమారుడు రామకృష్ణలు హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్‌కు వీటిని అందజేశారు.

విద్యుత్ లైన్ వెంట జంగిల్ క్లియరెన్స్

కోడూరు: విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, ముళ్లకంపలను ఆ శాఖాధికారులు గురువారం తొలగించారు. అవనిగడ్డ నుంచి వి.కొత్తపాలెం వరకు ప్రధాన రహదారి వెంట ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ వెంట జంగిల్ క్లియరెన్స్ పనులను భారీ యంత్రం సహాయంతో చేస్తున్నారు. ముళ్లచెట్లు, స్తంభాల వెంట పాకిన ముళ్లతీగలను తొలగించారు.

మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ

మచిలీపట్నంటౌన్: చిట్టి పిళ్లారయ్య దేవస్థానంలో శత చండీ సహిత మహారుద్ర యాగం అష్టమ వార్షికోత్సవాల ఐదో రోజైన గురువారం ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. పారాయణలో పాల్గొన్న సుమారు 200 మంది మహిళలకు ఎమ్మెల్యే పేర్ని నాని సతీమణి జయసుధ పసుపు, కుంకుమ, జాకెట్, అమ్మవారి ఫొటో, లలితా సహస్రనామ పారాయణ పుస్తకం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

అమరజీవి జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి


మోపిదేవిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు


పెడన మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి తదితరులు


అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కడవకొల్లు, ఎంపీపీ, సర్పంచ్


కోడూరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు


బందరులో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

అవనిగడ్డ: ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాలు అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించారు. అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నేత గార్లపాటి గోపీ, ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నా, ఆర్యవైశ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

- పెడన: పెడన ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, వైఎస్సార్ సీపీ నాయకుడు గరికిపాటి వెంకటరామానాయుడు, మండల సచివాలయాల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ బాలాజీ, ఈఓపీఆర్డీ ఎం. జయరాము తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- పెడన వర్తక వాణిజ్య మండలి ఆధ్వర్యంలో పాత కూరగాయల మార్కెట్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్తక వాణిజ్య మండలి నాయకులు బొలిశెట్టి బాలరాజు, భవిరిశెట్టి రామలింగయ్య, వీరమల్లు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక శ్రీవాసవి క్షేత్రంలో పట్టణ, మండల ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా మండలి, శ్రీవాసవి క్లబ్, కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకుడు కొల్లూరి చిన్నా, కేటీ మురళీకృష్ణ, వేముల రమేష్, జల్లూరి రమేష్, సునీల్, భవిరిశెట్టి నాగేశ్వరరావు, కొల్లిపర పద్మ పాల్గొన్నారు.
- స్థానిక బంగ్లా స్కూల్‌లో ఎంఈఓ మెటల్దారాణి, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అమరజీవికి నివాళులర్పించారు.
- మోపిదేవి: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఆంధ్రజాతి మరవలేనిదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు అన్నారు. మోపిదేవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరజీవి విగ్రహానికి క్షీరాభిషేకం

కోడూరు: స్థానిక సంతమార్కెట్ రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరినాథ్‌బాబు, అన్నం శ్రీనివాస్, దేసు మల్లికార్జునరావు, అర్వపల్లి బుజ్జి, కోడూరు సత్యనారాయణ, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

- చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా ఏర్పడిందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీలి మునలయ్య, సీనియర్ న్యాయవాదులు బాలకృష్ణ, మాదివాడ నరసింహారావు, ఉప్పాల కామేశ్వరరావు, ఎంపీఎస్ సతీష్ లలితకుమారి, పద్మావతి పాల్గొన్నారు.
- గూడూరు: స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు లింగం విజయ్‌కుమార్, నందం రవికిరణ్, నరహరిశెట్టి ధనేష్, కొల్లు వాసు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కరస్పాండెంట్ శోభ విద్యార్థులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టరు కె. కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: నగరంలోని కొల్లిపర సత్రం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య మహిళా విభాగం జిల్లా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం జరిగింది. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో సంఘ నాయకులు స్థానిక ఐదురోడ్ల సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- చల్లపల్లి: స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, కార్యదర్శి వరదా హరిగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ఓర్వలేకే టీడీపీ నేతల ఆరోపణలు

పెదప్రోలు(మోపిదేవి): దళారులతో ఎలాంటి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుంటే టీడీపీ నేతలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆదిరాంబాబు అన్నారు. పెదప్రోలు పీఏసీఎస్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీకి కూడా రాని వారిని వెంటేసుకుని టీడీపీ నాయకులు ప్రభుత్వం ధాన్యం కొనడం లేదని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 329 మంది రైతుల నుంచి 23,292.4 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, రూ. 4,76,99,704లకు గాను ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ. 4.36 కోట్లకు పైగా జమ చేశామని వివరించారు. మిగిలిన నగదుకు ఆఫ్‌లైన్ విధానం, ఆధార్ కార్డులలో తప్పులను సరిచేస్తున్నారని చెప్పారు. అనంతరం వారికి కూడా జమ చేస్తామన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా ఆర్‌బీకే, తమను సంప్రదించి పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

వియ్యంకులిద్దరూ చట్టసభలకు..


రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ఎమ్మెల్సీగా వంక రవీంద్రనాథ్ ఎన్నిక కావడంతో వియ్యంకులిద్దరికీ చట్టసభల్లో ప్రాతినిథ్యం లభించినట్లయింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకి రవీంద్రనాథ్ వియ్యంకుడు. వంక రవళి సింహాద్రి కోడలు. ఇలా వియ్యంకులు ఒకరు ఎమ్మెల్యేగా, మరొకరు ఎమ్మెల్సీగా ఉండటం దివిసీమలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్సీగా ఎన్నికైన రవీంద్రనాథ్‌ను ఎమ్మెల్యే సింహాద్రి కలుసుకుని అభినందించారు.

అకాల వర్షంతో ఆందోళన

- పలుచోట్ల ఓ మోస్తరు వర్షం
- ఆందోళనలో రైతులు
- మినుము పంటను ఇంటికి చేర్చేందుకు పాట్లు


నాగాయలంక మండలం తలగడదీవిలో మినుము పంటను పట్టాలపైకి లాగుతున్న రైతు


కోడూరులో మినుము నూర్పిళ్లు చేస్తున్న రైతులు

అవనిగడ్డ: దివిసీమలో గురువారం పలుచోట్ల కురిసిన వర్షం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. పొలాల్లో ఆరబెట్టిన మినుము పంటను ఇళ్లకు చేర్చుకునేందుకు పరుగులు తీశారు. కొన్ని ప్రాంతాల్లో పట్టిన కారుమబ్బులు రైతులను కలవరపాటుకు గురిచేశాయి. అవనిగడ్డ నియోజకవర్గంలో రబీలో 56,485 ఎకరాల్లో మినుము, 84 ఎకరాల్లో పెసర సాగు చేశారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 85 శాతం మినుము నూర్పిళ్లు జరిగాయి. అవనిగడ్డలో 65 శాతం పూర్తికాగా, నాగాయలక, కోడూరు మండలాల్లో మినుము తీత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రైతులను పరుగులు పెట్టించిన వర్షం..

నాగాయలంక మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం వర్షం కురిసింది. సొర్లగొంది, పెదగొడపాలెం, గణపేశ్వరం, తలగడదీవిలో వర్షం కురిసింది. దీంతో కొంతమంది రైతులు పొలాల్లో ఆరబెట్టిన మినుముని కాపాడుకునేందుకు పరుగులు తీశారు. పట్టాలు తీసుకెళ్లి తడవకుండా కప్పారు. మరికొందరు ట్రాక్టర్ల ద్వారా పంటను ఇళ్లకు చేర్చుకున్నారు. కూలీలతో లాగించిన పంటను యంత్రంతో నూర్పించి ఇళ్లకు చేర్చుకుంటున్నారు. మరికొందరు పొలాల్లో ఆరబెట్టిన పంటను హడావిడిగా ఇళ్లకు తరలిస్తున్నారు.

వర్షం పడితే తీవ్ర నష్టం

రానున్న మూడు రోజులు వర్షాలు ఉంటాయంటున్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎంతో కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చాలా చోట్ల మినుము పంట తయారై ఎండిపోయిందని, ఈ సమయంలో ఏ మాత్రం చినుకులు పడినా కాయ పగిలి పోయి విత్తనాలు భూమి పాలవుతాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరో పది రోజులు వర్షాలు లేకుంటే అందరూ గట్టెక్కుతారని చెబుతున్నారు.

కారుమబ్బులతో కలవరం

కోడూరు: కోడూరు మండలంలోని వి.కొత్తపాలెం, మాచవరం ప్రాంతాల్లో గురువారం చిరుజల్లులు పడ్డాయి. ఎగువ ప్రాంతాల్లో మినుము కాయ తీతలు పూర్తి చేసి పొలాల్లో గుట్టలుగా వేయగా, దిగువ ప్రాంతాల్లో కాయ తీత పనులను రెండు రోజుల కిందటే ప్రారంభించారు. వి.కొత్తపాలెం, మాచవరం, జయపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో మినుము పంట పొలాల్లో కుప్పలుగా వేసి ఉండగా, కోడూరు, దింటిమెరక, ఉల్లిపాలెం, పిట్టల్లంక, విశ్వనాథపల్లి గ్రామాల్లో మినుము పంట కాయతీతకు సిద్ధంగా ఉంది. వాతావరణం మారడంతో గురువారం కొంతమంది రైతులు హడావుడిగా మినుము పంటను నూర్పిళ్లు చేస్తూ కనిపించగా, మరికొందరు యంత్రాల సహాయంతో కాయతీత పనులు నిర్వహించారు.

- పెడన: మండలంలో మినుము తీత పనులు పూర్తి చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు పోత మిషన్ల కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇవి లభించకపోవడంతో కుప్పగా పోసి పరదాలు కప్పుతున్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 70 శాతం వరకు మినుము తీత పనులు పూర్తయ్యాయని వ్యవసాయశాఖాధికారుల అంచనా.

ఎమ్మెల్సీ బచ్చులకు కౌన్సిల్ నివాళి

సమావేశం నేటికి వాయిదా


బచ్చుల అర్జునుడుకు నివాళులర్పిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, అధికారులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడుకు సభ్యులు నివాళులర్పించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ సమావేశానికి అధ్యక్షత వహించి మునిసిపల్ మాజీ చైర్మన్‌గా పనిచేసిన బచ్చుల అర్జునుడుకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి సభ్యులంతా ఆమోదం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మన్నే శారదా, పరింకాయల విజయ్, యండ్రపాటి నాగేశ్వరరావు, శ్రీరాం చిన్నా, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, సమతా కీర్తి, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత తదితరులు బచ్చుల అర్జునుడు చేసిన సేవలను కొనియాడారు.

సమావేశాన్ని సంతాప తీర్మానంతో వాయిదా వేసి నాలుగు అంశాలతో ఉన్న అజెండాపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు మళ్లీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని మేయర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు.

రంగు మారిన ధాన్యం కొంటున్నాం

ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి నివేదించగా వెంటనే కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు.

గతంలో నిలిచిపోయిన కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించామని చెప్పారు. అవనిగడ్డలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోపిదేవి మండలంలో ధాన్యం కొనడం లేదని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, తడచి రంగు మారిన ధాన్యాన్ని ఆరిన తరువాత తీసుకురావాలని ఆర్‌బీకే సిబ్బంది చెప్పగా ధాన్యం కొనడం లేదని టీడీపీ నేతలు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, ఎక్కడన్నా సమస్యలు తలెత్తితే వెంటనే తనకు ఫోన్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, నాగాయతిప్ప సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), ఏపీ వ్యవసాయ మిషన్ మండల కన్వీనర్ మత్తి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు భూమి పూజ


పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 29వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 6.91 లక్షలతో నిర్మించనున్న నూతన పైప్‌లైన్ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేశారన్నారు. డివిజన్‌కు రూ. 20 లక్షల నిధులు కేటాయించారని, ఈ నిధులతో ఆయా డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కమిషనర్ జి. చంద్రయ్య, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్ విద్యార్థికి అడ్మిషన్

కోడూరు: ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువు మానేసిన డ్రాప్ అవుట్ విద్యార్థికి ప్రభుత్వ బడిలో అడ్మిషన్ కల్పించారు. వేటపాలెం గ్రామానికి చెందిన మాచర్ల దేవకినందన్ కోడూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతిలో చేరాడు. పాఠశాలకు ఫిబ్రవరి నెల వరకు బాగానే వెళ్లినా తరువాత ఫీజులు చెల్లించలేక పోయాడు. దీంతో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థిపై ఒత్తిడి తీసుకురావడంతో చేసేది లేక దేవకినందన్ చదువు మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న కోడూరు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం గురువారం రాత్రి 8 గంటల సమయంలో దేవకినందన్ ఇంటికి వెళ్లి ప్రభుత్వ బడిలో అడ్మిషన్ కల్పించారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా బడిబాట పట్టించారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించండి

మచిలీపట్నంటౌన్: జగనన్న కాలనీల్లో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గురువారం రాత్రి 32వ డివిజన్ చింతగుంటపాలెం నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్పొరేటర్ చింతా వెంకటేశ్వరరావు, డివిజన్ కన్వీనర్ చింతా మానిక, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 49వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్ పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించండి

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీలు నిర్వహించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా కో–ఆర్డినేటర్ గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ముత్యాలనాయుడును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ నవీన్, సంఘ నాయకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

కోడూరు: జరుగువానిపాలెం గ్రామంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. కోడూరు నుంచి పోటుమీద వరకు నూతనంగా డబుల్ లైన్ రహదారి నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన రహదారిని ఆనుకొని మళ్లీ ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇదంతా జరిగి ఐదు నెలలు గడుస్తుండగా రహదారి వెంట ఏర్పాటు చేసిన స్తంభాలు ఒరిగిపోవడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జరుగువానిపాలెం గ్రామంలో ప్రస్తుతం రహదారి వెంట పైపులైన్ పనులు సాగుతుండగా, పైపులైన్ కోసం తవ్విన గుంతల వైపు స్తంభాలు ఒరిగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలు ఒరగకుండా పనులను పటిష్ఠంగా చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ జి. శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలను వారు పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

పీఎండీఎస్‌పై రైతులకు అవగాహన

బంటుమిల్లి: మల్లపరాజుగూడెం రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే) ఆధ్వర్యంలో గురువారం రైతులకు ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)పై శిక్షణ ఇచ్చారు. రుతుపవనాలు ముందుగా ప్రవేశిస్తే రైతులు భూమి సారంవంతం అయ్యేందుకు పప్పు ధాన్యాలను ఏ విధంగా వినియోగించాలి, ఏ పద్ధతిలో విత్తన శుద్ధి చేయాలి, తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులతో చేయించి శిక్షణ ఇచ్చారు. ఈ పద్ధతి వల్ల భూమి గుల్లబారి సారవంతంగా మారి చీడపీడలను తట్టుకుంటుందని వివరించారు. ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు టి. రాజు, రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గూడూరు: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని గూడూరు మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెప్సిబారాణి అన్నారు. కప్పలదొడ్డిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో రబీలో అపరాలు సాగు చేసిన రైతులు పంటను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని సూచించారు. పొలంపై కుప్పలదశలో ఉన్న పంట వర్షాలకు తడవకుండా పరదాలు కప్పాలని చెప్పారు. వీఏఏలు బ్రహ్మం, పవన్, కల్యాణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.